# చంద్రమండలంలో సినీపరిశ్రమ

"శారద"

[చంద్ర మండలం నుంచి ఇటీవల తిరిగివచ్చిన ఒక సినిమా పత్రిక విలేఖరి, అక్కడి సినిమా పరిశ్రమ గురించి తెలియజేసిన వివరాలివి. ఆ విలేఖరి నిష్పక్షపాతంగా, ఆ వివరాలన్నిటిని ఇచ్చాడనే నా ఉద్దేశం.]

ఆయన ఏమంత ఉత్సాహంగా కనపడలేదు గాని, కొన్ని కొత్తసంగతులు తెలుసుకున్న వాడల్లే అగుపించాడు. ఆయన్ని ఆయనింట్లో ఒక మధ్యాహ్నంవేళ కలుసుకుని సంభాషణ సాగించాను, వేడి కాఫీల ముందు.

"మీరు ఈమధ్య చంద్రమండలం వెళ్ళివచ్చారటగా?"

"అవునండి. చాలా కష్టమైన ప్రయాణం!"

"కాదండిమరి! మీరు, ఒక్క సినిమా పరిశ్రమను గురించే పరిశీలించారా, లేక అన్ని రకాల...?"

"అన్నీ చూడడం సంభవం కాదుకదండీ? అయితే ఏం? సినిమా అనేప్పటికి, తీగలాగితే డొంకంతా కదిలినట్టుగా ఇతర సమస్యలూ కొద్ది కొద్దిగా తెలిసినయ్."

"అలాగా!"

"కాదండి మరి? చంద్రలోకంలో మూడు ఖండాలూ,నూటొక్క భాషా ఉన్నాయి. చెప్పన్ని దేశాలూ ఉన్నాయి. ఈ మధ్యనే గొప్పయుద్ధం వొచ్చి ఇప్పుడే శాంతి నెలకొంటున్నదట."

మనభూమికి పట్టినరాతే పట్టిందీ వాళ్లకిన్నీ?"

"మనం నయం! వాళ్ళకిది నాల్గవ మహాయుద్ధమట."

"దానిమూలంగా సినిమా పరిశ్రమ దెబ్బ తిన లేదూ?"

"మాట్లాడకూడదు. ఇంకా అభివృద్ధి అయిందట! సినిమాలు చూసేవాళ్ళసంఖ్య యుద్ధాలవల్ల పెరుగుతున్నదని, అక్కడిరాజకీయ వర్గాల, సినిమా నిర్మాతల అభిప్రాయం."

"కావచ్చు. కావచ్చు."

"సాంతం వినండి. సినిమా ప్రేక్షకుల సంఖ్య పెరిగేందుకు,అమూలకంగా ప్రభుత్వాలఆదాయం పెరిగేందుకు, దక్షిణ చంద్రలోకం వాళ్లప్రభుత్వం ఒక చట్టం ప్యాసుచేసింది. ఆ ప్రకారం సినిమా చూడగోరే ప్రతివాడూ (కుర్రవాడుగాని, స్త్రీగాని, పురుషుడుగాని) ప్రభుత్వం దగ్గిర అయిదు కీపాయలు, (ఒక కీపాయ అయిదు రూపాయిలతో సమానం) కట్టి లైసెన్సు పొందాలి. ఇది ఒక సంవత్సరానికి వర్తిస్తుంది. ఇక సినిమా చూడ వచ్చు ఆ వ్యక్తి."

"మన ఎంటర్‌టెయిన్‌మెంట్ టాక్సుకన్న ఇది బాగా వున్నదంటారా?"

"వినోదంపన్ను వేరే వుండనే వుందండీ అక్కడ."

"సరే. సరే."

"పోతే నిర్మాతలమీద సెన్సారింగ్ నిబంధాలేమీలేవు!..."

"ఊ..."

"నేనొకచిత్రం చూసాను. మొత్తం ఆరు గంటలచిత్రం..."

"ఆరుగంటలే!...అమ్మ బాబ్రే!"

"భయపడకయ్యా! మనగంట వాళ్ళకి రెండు గంటలట...అదీకాకుండా అక్కడకూడా ఐదు గంటలచిత్రాలు, మూడుగంటలచిత్రాలూ కావాలనే దౌర్భాగ్యులు ఉన్నారు. కాని నిర్మాతలు మాత్రం పట్టుదలగా ఆరుగంటల చిత్రాలే చూపిస్తున్నారు. "ప్రజలమాట వినిపించుకోరేం?" అని నేనొకనిర్మాతనడిగితే "ప్రజలు పసి పిల్లలండీ. వాళ్ళమాటలకి అర్థంవుండదు. వాళ్ళని మనం మన "మంచి" పద్ధతులకి

అలవాటు చెయ్యాలి!" అన్నాడు. నేను ఆ ఆరు గంటల సినిమాకి వెళ్లాను. ఒకటే డాన్సులూ పాటలూనూ. బ్రహ్మాండమైన సెట్టింగులూ!"

"మీకు అక్కడభాష ఎట్లాఅర్థమైంది?"

"మొదటు ఇబ్బందిపడ్డమాట నిజమే. కాని ఒకకిటుకు తెలుసుకు నేసరికీ అంతా తెలిసిపోయింది."

"ఏమిటా కిటుకు?"

"ఏమీలేదు, అరవయాసలో తెలుగు, తెలుగు యాసలో అరవం మాట్లాడుతున్నారు!"

"మన మద్రాసుసినిమారంగం జ్ఞాపకంరాలా?"

"అనేకచోట్ల మనం పొరపాటున మద్రాసులో ఉన్నామా అన్న భ్రమగలిగినమాట నిజమే"

"ఆ చిత్రాల గురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"ఏముంటుంది? అక్కడ నేను మూడు రకాల చిత్రాలు చూశాను. ఒకటి ప్రేయసీ ప్రియులు ఒకరికోసం ఒకరు అడవుల వెంట, బజార్ల వెంట తిరిగి, వీలయినప్పుడల్లా మేడమెట్లమీదా, నేల మీద బోర్లాపడుకుని దేకిపాటలు పాడుతూ చావటం, ఇవి సాంఘికాలట; రెండు. సాధ్యమైనన్ని గుర్రపుస్వారీలు, కత్తియుద్ధాలూ, బాంబులు పేలటాలు, చివరికి రాజురాణీ పెళ్ళి-ఇవి చరిత్రాత్మకాలు; మూడు. దేవతలూ, నగ్న నృత్యాలూ, మాయం కావటాలూలూనూ-ఇవి పౌరాణికాలట!"

"టెక్నికల్‌గా వాళ్లపిక్చర్లు బాగుంటాయా?"

"దానికి లోపంలేదు."

"ప్రొడ్యూసర్లు తమ సినిమాల్లో ఎవరికి ఎక్కువ విలువఇస్తూంటారు?"

"తారలు మొదటి శ్రేణిలోకి వస్తారు. వాళ్ళ సినిమా ఏదిచూసినా మంచిమంచితారలు డజనుకి తక్కువ వుండరు. రెండవది డైరెక్టరు. మూడవది డిస్ట్రిబ్యూటరు!"

"డిస్ట్రిబ్యూటరు సినిమా తీసేప్పుడు ఏం చేస్తాడు?"

"వడ్డీకి డబ్బులు ఇచ్చేది వాడేగా?"

"మిగతా టెక్నీషియనుల మాటేమిటి?"

"జీతాలకి పనిచేస్తారు వాళ్ళు. వాళ్ళకసలు ప్రాధాన్యమే లేదు."

"రచయిత?"

"ఆయనా వుంటూవుంటాడు. ప్రొడ్యూసరు ఇచ్చే ఒకరకం కథను మాటల్లో పెట్టటం ఆయన వంతు. అంతటితో ఆయనపని ఐపోతుంది."

"మరి సంభాషణలో?"

"సంభాషణలు! ఓనమాలు వచ్చిన ప్రతివాడు సంభాషణలు రాయగలడనే ఉద్దేశం వెలిబుచ్చాడొక డైరెక్టరు."

"తారల విలువ చాలా జాస్తీయేనా?"

"మొత్తం నిర్మాణవ్యయంలో సగం తారల కిందే ఖర్చు."

"మరి అక్కడ సెన్సారింగు ఉన్నదా?"

"ఉన్నది. అయితే ఆ సెన్సారింగుకు ఒకటే నిబంధన; నువ్వు డబ్బుండి ఏ సినిమా అన్నా తీయి. ప్రభుత్వానికేం అభ్యంతరం లేదు. అందులో నీ జాతీయత, సంస్కృతీ ఉన్నా, లేకపోయినా, బహిరంగంగా హత్యచేయబడుతున్నా ఫరవాలేదు. సెక్సు అప్పీల్ ఎన్నిటన్నలున్నా ఇబ్బందిలేదు. ప్రభుత్వ రాజకీయ పోలసీని విమర్శించకపోతే, ఆ సినిమాలో ఒక్క ముక్క కత్తరించే హక్కు సెన్సార్‌బోర్డుకి లేదు."

"సినిమా కథలు?"

"ముందే చెప్పానుగా!... ట్రైయాంగ్యులర్ లవ్ స్టోరీసూ, క్రైం కథలూ, అడవి వీరుల కథలూ."

"వీట్ని భరించటానికి చంద్రలోకవాసులు ఎంత సహనశీలురై వుండాలి!"

"అవి తప్ప ఇంకేమీ రానప్పుడూ, వస్తాయనే ఆశలేనప్పుడూ, వాళ్ళేకాదు, మనంగూడా వాటికే అలవాటుపడిపోతామేమో?"

---

మనకంటే నైతికంగా ఉన్నతులైనవారి సలహాలు పాటించడానికి మనమెప్పుడూ సిద్ధమే; ఎటొచ్చీ-అటువంటివాళ్లు ప్రపంచంలో ఉండాలిగద!